

ఓడీసీ మండలం గాజుకుంటపల్లిలో జనసందోహం

ఘన స్వాగతాలు.. ఆత్మీయ పలకరింపులు..

జిల్లాలో నిజం గెలవాలికి నారా భువనేశ్వరి శ్రీకారం



నల్లచెరువులో ప్రజలకు అభివాదం చేస్తున్న నారా భువనేశ్వరి

తొలిరోజు పుట్టపర్తి, కదిరి డివిజన్లలో పర్యటన
అడుగడుగునా ఘన స్వాగతం
అందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ.. ముందుకు కదిలిన నారా భువనేశ్వరి



పుట్టపర్తి రూరల్, ఫిబ్రవరి 13: తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరికి పార్టీ శ్రేణులు, అభిమానులు జిల్లాలో అడుగడుగునా ఘన స్వాగతం పలికారు. అందరినీ ఆమె ఆప్యాయంగా పలకరిస్తూ ముందుకు సాగారు. నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా నారా భువనేశ్వరి మంగళవారం జిల్లా పర్యటనకు వచ్చారు. మంగళవారం ఉదయం ప్రత్యేక విమానంలో గన్నవరం నుంచి పుట్టపర్తి సత్యసాయి విమానాశ్రయం చేరుకున్న నారా భువనేశ్వరికి టీడీపీ ఉమ్మడి జిల్లా నేతలు ఘన స్వాగతం పలికారు. అనంతరం నారా భువనేశ్వరి ఎయిర్‌పోర్టు నుంచి రోడ్డుమార్గంలో పుట్టపర్తి రూరల్ మండలం గాజులపల్లికి బయలుదేరారు. మార్గమధ్యలో మామిళ్లకుంట, కప్పలబండ, పెడబల్లితో పాటు దారిపొడవునా టీడీపీ శ్రేణులు, మహిళలు పెద్దఎత్తున తరలివచ్చి, ఘన స్వాగతం పలికారు. పచ్చటి తోరణాలు, రంగవల్లులు, మంగళహారతులతో బ్రహ్మరథం పట్టారు. అటు నుంచి ఓబుళదేవరచెరువు మండలం గాజుకుంటపల్లికి వెళ్లారు. అక్కడ కూడా జనం ఘన స్వాగతం పలికారు. కదిరి, తనకల్లు, తలుపుల మండలాల్లో నారా భువనేశ్వరి పర్యటించారు. గ్రామాల్లోనే కాకుండా దారి మధ్యలో సైతం నారా భువనేశ్వరి కోసం జనం ఎదురుచూశారు. ఆమె రాగానే ఘనస్వాగతం పలికారు. నారా భువనేశ్వరి వారికి అభివాదం చేస్తూ.. ఆప్యాయంగా పలకరిస్తూ ముందుకు కదిలారు. రాత్రికి కదిరి సమీపంలోని హరీష్ స్కూల్‌కు చేరుకుని, బస చేశారు. రెండోరోజు బుధవారం నారా భువనేశ్వరి ధర్మవరం, రాప్తాడు, పెనుకొండ నియోజకవర్గాల్లో పర్యటించనున్నారు.



పుట్టపర్తి మండలం మామిళ్లకుంట కూడలిలో నారా భువనేశ్వరికి స్వాగతం పలకడానికి వేచివున్న మహిళలు



పుట్టపర్తిలో చిన్నారికి ఆప్యాయంగా చాక్లెట్ ఇస్తూ..



నారా భువనేశ్వరికి బొట్టుపెట్టి స్వాగతం

సచివాలయ సర్వేయర్ ఆత్మహత్యాయత్నం



పని ఒత్తిడి భరించలేకే.. అధికారుల మద్దతు కరువైందంటూ ఆవేదన
తహసీల్దార్‌తో సంభాషణ ఆడియో బహిర్గతం

తనకల్లు, ఫిబ్రవరి 13: మండలంలోని టి సదుం గ్రామ సచివాలయంలో సర్వేయర్‌గా పని చేస్తున్న విజిత పని ఒత్తిడి భరించలేక మంగళవారం విషం తాగి ఆత్మహత్యకు యత్నించింది. కుటుంబ సభ్యులు, స్నేహితులు తెలిపిన వివరాల మేరకు.. తనకల్లు మండల కేంద్రానికి చెందిన విజిత టి.సదుం సర్వేయర్‌గా పనిచేస్తున్నారు. టి. సదుం పంచాయతీ పరిధిలోని అగ్రహారం రెవెన్యూ గ్రామంలో భూ రీసర్వే కొనసాగుతోంది. కార్యక్రమాలు పూర్తి కావచ్చాయి. అధికారుల నుంచి మద్దతు కరువవడం, తహసీల్దార్ శోభానువర్ణమ్మ దృష్టికి తీసుకెళ్లినా.. ఎలాగైనా పని పూర్తి చేయాల్సిందేనంటూ తేల్చిచెప్పడంతో మనస్తాపం చెందిన విజిత మంగళవారం ఇంట్లోనే విషద్రావకం తాగింది. అగ్రహారం గ్రామంలో రీసర్వే నిర్వహించిన భూముల్లో రాళ్ల పాతడానికి కూలీలు కూడా దొరకడం లేదనీ, ఈ విషయంలో వీఆర్‌ఏ, వీఆర్‌ఓ పట్టించుకోవట్లేదని తహసీల్దార్‌కు విజిత ఫిర్యాదు చేశారు. ఏం చేస్తావో.. తనకు తెలీదనీ, పని పూర్తికావాల్సిందేనంటూ తహసీల్దార్ తెగేసి చెప్పారు. తహసీల్దార్, సర్వేయర్ మధ్య సాగిన ఫోన్ సంభాషణను రికార్డు చేశారు. దీంతో మనస్తాపం చెంది ఆత్మహత్యకు ప్రయత్నించింది. కుటుంబీకులు వెంటనే గుర్తించి తనకల్లు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం నిమిత్తం కదిరి ఆస్పత్రికి తీసుకెళ్లారు. విజిత ఆత్మహత్యాయత్నంపై తహసీల్దార్ శోభానువర్ణమ్మ మాట్లాడుతూ.. తాను ఒత్తిడి చేయలేదనీ, పనిచేయాలని మాత్రమే సూచించానన్నారు.

రేపు టెన్త్ పరీక్షలపై సమావేశం

కొత్తచెరువు, ఫిబ్రవరి 13: పదో తరగతి పబ్లిక్ పరీక్షల నేపథ్యంలో ఈనెల 15వ తేదీన మధ్యాహ్నం 2 గంటలకు బుక్కపట్నంలోని డైట్ కళాశాలలో సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లా పరీక్షల విభాగాధికారి లాజర్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. సమావేశానికి విద్యాశాఖ ఏడీలు, ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్, కేజీబీవీ, ఏపీఎంఎస్‌ల హెచ్‌ఎంలు హాజరు కావాలని ఆయన తెలియజేశారు.

ఆరుగురు ఎస్‌ఐల అటాచ్



పుట్టపర్తి రూరల్, ఫిబ్రవరి 13: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ఆరుగురు ఎస్‌ఐలను అటాచ్ చేస్తూ ఎస్పీ మాధవరెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. జిల్లా వీఆర్‌లో ఉన్న ధరణీబాబును తనకల్లు, దిలీప్‌కుమార్‌ను తలుపుల, శ్రీనివాస్‌ను ధర్మవరం వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌కు పంపారు. తలుపులలో పనిచేస్తున్న మక్బూల్‌బాషాను అమడగూరుకు, అమడగూరు నుంచి బాలరామయ్యను కదిరికి, తనకల్లులో పనిచేస్తున్న రాజశేఖర్‌ను పుట్టపర్తి అర్బన్ పోలీసుస్టేషన్‌కు అటాచ్ చేస్తూ ఎస్పీ ఉత్తర్వులు జారీచేశారు. ఆయా ఎస్‌ఐలు తక్షణమే విధుల్లో చేరాలని అందులో పేర్కొన్నారు.

సైబర్ మోసగాళ్ల ఉచ్చులో యువ రైతు

రూ.34 లక్షలు పోగొట్టుకున్న వైనం



రొద్దం, ఫిబ్రవరి 13: మండలంలోని చిన్నకోడిపల్లికి చెందిన యువ రైతు సీకే రవి సైబర్ మోసగాళ్ల ఉచ్చులో చిక్కి ఏకంగా ఏకంగా రూ.34 లక్షలు మోసపోయాడు. బాధితుడు, గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు వివరాలివి. చిన్నకోడిపల్లికి చెందిన ఓ వ్యక్తి క్యాన్సర్ బారిన పడడంతో గ్రామస్థులు చందాలు వేసుకుని, బెంగళూరులో వైద్యం చేయించారు. అందులో సీకే రవి ఒక్కడే రూ.4 లక్షలు భరించాడు. ఆ తర్వాత అతడికి ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ వ్యక్తి పరిచయమయ్యాడు. పేదల వైద్యానికి సాయం చేస్తే.. బడాబాబుల నుంచి పెద్దమొత్తంలో డబ్బు ఇప్పిస్తామని నమ్మబలికాడు. ఆదాయప పన్ను నుంచి తప్పించుకునేందుకు బడాబాబులు పెద్ద మొత్తంలో డబ్బు ఇస్తారని చెప్పాడు. పేదల వైద్యానికి సాయం చేయాలని సూచించాడు. వాటిని నమ్మిన సీకే రవి.. వారు చెప్పిన బ్యాంకు ఖాతాలకు డబ్బు జమ చేస్తూ వచ్చాడు. ఇలా రూ.2లక్షలు, రూ.3లక్షలు చొప్పున 25 రోజుల్లో రూ.35లక్షలు డబ్బు జమచేశాడు. ఆ సొమ్ము మొత్తం బంధువులు, తెలిసిన వారి వద్ద రూ.5 వడ్డీకి తెచ్చాడు. సైబర్ నేరగాళ్లు రూ.1.50కోట్లు జమ చేస్తామని చెప్పడంతో అత్యాశకు లోనయ్యాడు. కొన్నిరోజుల తరువాత వారు ఫోన్ రిసీవ్ చేయకపోవడంతో మోసపోయానని గ్రహించి, రెండు రోజుల క్రితం రొద్దం పోలీసులను ఆశ్రయించాడు. సైబర్ సెల్‌లో ఫిర్యాదు చేయాలని వారు సలహా ఇచ్చి పంపారు.

ఇసుక రీచ్ వద్దే వద్దు..!

ఏర్పాటుకు అధికారుల పరిశీలన
అడ్డుకుంటామంటున్న గ్రామస్థులు



పొలాలను పరిశీలిస్తున్న అధికారులు



రీచ్‌ను అడ్డుకుంటామంటున్న గ్రామస్థులు

తాడిమర్రి, ఫిబ్రవరి 13: మండలంలోని నాయనిపల్లి సమీపంలో ఇసుక రీచ్ వద్దే వద్దనీ, ఏర్పాటు చేస్తే అడ్డుకుంటామని గ్రామస్థులు తెగేసి చెప్పారు. గ్రామ సమీపాన 695వ సర్వే నంబరులో ఇసుక రీచ్ ఏర్పాటుకు గనులశాఖ డీడీఓ రామ్మోహన్‌రావు, తహసీల్దార్ నజ్మాబాను, స్థానిక వీఆర్వో సావిత్రి పరిశీలించారు. భూములను ఎందుకు పరిశీలించారన్న విషయాన్ని అధికారులు ధృవీకరించలేదు. గతంలోనే ఇక్కడ ఇసుక రీచ్ ఏర్పాటుకు అప్పటి తహసీల్దార్ ఫైల్ సిద్ధం చేసి పంపినట్లు తెలిసింది. ప్రస్తుతం రీచ్ ఏర్పాటుకు సంబంధించిన సమాచారం తనకు తెలియదని తహసీల్దార్ నజ్మాబాను పేర్కొన్నారు.

అడ్డుకుంటాం

నాయనపల్లి సమీపంలో ఎక్కడ ఇసుక రీచ్ ఏర్పాటు చేసినా అడ్డుకుంటామని గ్రామస్థులు స్పష్టం చేశారు. గ్రామ సమీపంలో అధికారులు పొలాలను పరిశీలిస్తున్నట్లు తెలుసుకున్న వారు.. ఆ ప్రాంతానికి చేరుకున్నారు. అప్పటికే అధికారులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఆ తరువాత గ్రామస్థులు గంగాధర్,బాబాబాషా, మాబుబాషా, ఆదెప్ప, నారాయణస్వామి, హుస్సేన్, నాగయ్య, శంకరయ్య, బాబా మాట్లాడుతూ.. ఇసుక రీచ్ ఏర్పాటును అడ్డుకుంటామన్నారు. ఇప్పటికే లక్షుంపల్లి గ్రామం వద్ద ఉన్న ఇసుక రీచ్ వల్ల ఆ ప్రాంతంలో భూగర్భజలమట్టం పడిపోయిందని తెలిపారు. గ్రామ పరిధిలో కూడా అదే పరిస్థితి తలెత్తితే తాము జీవనాధారం కోల్పోతామని వాపోయారు.





నేనున్నా...

కష్టాల్లో తోడుంటాం

నిజం గెలవాలి యాత్రలో నారా భువనేశ్వరి

చంద్రబాబు అక్రమ అరెస్టును తట్టుకోలేక మృతి చెందిన కుటుంబాలకు పరామర్శ

పుట్టపర్తి, కదిరి నియోజకవర్గాల్లో పర్యటన

అడుగడుగునా ఘన స్వాగతాలు

పుట్టపర్తి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): 'అధైర్య పడవద్దు.. తెలుగు దేశం పార్టీ మీకు అండగా ఉంటుంది. పార్టీ కోసం కష్టపడి ప్రాణాలు కోల్పోయిన బాధిత కుటుంబాలను ఎప్పటికీ మరువదు. మీకు అండగా ఉంటామని చెప్పడానికే నేను మీ ఇంటి ముంగిటకు వచ్చా' అని టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరి.. బాధిత కుటుంబ సభ్యులకు భరోసా కల్పించారు. వైసీపీ ప్రభుత్వం రాజకీయ కక్ష సాధింపులో భాగంగా నారా చంద్రబాబునాయుడిపై అక్రమ కేసులు పెట్టి, జైలుకి పంపిన సందర్భంలో వందలాది మంది పార్టీ కార్యకర్తలు మనస్తాపం చెంది, ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. వారి కుటుంబాలను పరామర్శించేందుకు నారా భువనేశ్వరి మంగళవారం ఉమ్మడి జిల్లా పర్యటన నిమిత్తం వచ్చారు. బాధిత కుటుంబాలకు వెళ్లి, కుటుంబ సభ్యులను భువనేశ్వరి పరామర్శించి, ఓదార్చారు. శ్రీసత్యసాయి విమానాశ్రయానికి ప్రత్యేక విమానంలో చేరుకున్న ఆమెకు ఉమ్మడి జిల్లా నేతలు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. విమానాశ్రయం నుంచి ఆమె నేరుగా పుట్టపర్తి మండలం నిడిమామిడి గాజులకుంట గ్రామానికి చేరుకొని టీడీపీ కార్యకర్త మునిమడుగు బావయ్య కుటుంబాన్ని పరామర్శించారు. బావయ్య చిత్రపటానికి నివాళులు అర్పించిన ఆమె భావోద్వేగానికి లోనయ్యారు. బావయ్య కుటుంబ సభ్యుల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అతడి కుటుంబ సభ్యులకు రూ.3 లక్షల ఆర్థికసాయం చెక్కు అందజేశారు. ఓబుళదేవర చెరువు మండలం గాజుకుంటపల్లిలో మేకల రామచంద్ర కుటుంబాన్ని ఆమె పరామర్శించారు. ఆ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అధైర్యపడవద్దనీ, పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. అనంతరం రూ.3 లక్షల చెక్కు అందజేశారు. కదిరి పట్టణంలోని 8వ వార్డులో టీడీపీ కార్యకర్త మద్దిగల్ల ప్రకాష్ కుటుంబాన్ని పరామర్శించారు. తనకల్లు మండలం కొర్తికోటలో షేక్ బుడేన్ సాబ్, కదిరి రూరల్ మండలం ముష్టిపల్లిలో చంద్ర, తలుపులలో చిన్నకోట్ల మహేశ్వర కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. మృతిచెందిన వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. అనంతరం వారికి మనోధైర్యం చెప్పారు. నారా భువనేశ్వరికి అయా గ్రామాల్లో పార్టీ కార్యకర్తలు, ప్రజలు అడుగడుగునా ఘనస్వాగతం పలికారు.

భువనేశ్వరి పర్యటన కోసం..





సత్యసాయి ఎయిర్‌పోర్టు బయట అభివాదం చేస్తున్న నారా భువనేశ్వరి



కదిరిలో ప్రకాష్ కుటుంబ సభ్యులకు చెక్కు పంపిణీ చేస్తున్న భువనేశ్వరి





ఓడీసీ మండలం గాజుకుంటపల్లిలో బాధిత కుటుంబ సభ్యులకు భరోసా ఇస్తున్న భువనేశ్వరి



పుట్టపర్తి మండలం గాజులపల్లిలో బావయ్య కుటుంబ సభ్యురాలిని ఓదారుస్తూ..



తలుపుల మండలం ఎగువపేటలో బాధితులతో మాట్లాడుతూ...

హాస్టల్ విద్యార్థినులతో మాటామంతి



కదిరి పట్టణంలోని 8వ వార్డులో బాధిత కుటుంబాన్ని పరామర్శించి వస్తున్న నారా భువనేశ్వరి అక్కడే ఉన్న బీసీ హాస్టల్ విద్యార్థులతో అప్యాయంగా మాటామంతి కలిపారు. వారితో కాసేపు మాట్లాడారు. వారిని దగ్గరకు తీసుకుని, ఏమి చదువుతున్నారు? హాస్టల్‌లో ఎలా ఉంది? బాగా చదువుకుంటున్నారా? భోజనం సరిగా పెడుతున్నారా? అని అడిగి తెలుసుకున్నారు. వారితో కరచాలనం చేసి, ఫొటో దిగారు. దీంతో విద్యార్థులు ఆనందంలో మునిగిపోయారు. బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని వారికి సూచించారు. ఆమె వెంట టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీకే పార్థసారథి, మాజీ మంత్రులు పరిటాల సునీత, పల్లె రఘునాథరెడ్డి, ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప, టీడీపీ కదిరి ఇన్‌చార్జి కందికుంట వెంకటప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి సవిత, శింగనమల నేత బండారు శ్రావణి పాల్గొన్నారు.

భువనేశ్వరికి ఘన స్వాగతం

నిజం గెలవాలి యాత్రలో భాగంగా జిల్లాలో పర్యటిస్తున్న నారా భువనేశ్వరికి దారిపొడవునా ప్రజలు, కార్యకర్తల నుంచి ఆత్మీయ స్వాగతం లభించింది. ఆయా గ్రామాల్లో భువనేశ్వరిని చూసేందుకు మహిళలు పెద్దఎత్తున వచ్చారు. ఆమెకు హారతులు పట్టి, పూలజల్లుతూ అభిమానం చాటుకున్నారు. ఎయిర్‌పోర్టు నుంచి బయటకి వచ్చే క్రమంలో వేలాది మంది పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆమెకు స్వాగతం పలికారు. మార్గమధ్యలో మామిళ్లకుంట క్రాస్, కప్పలబండ, బత్తలపల్లి, పెడబల్లి, నిడుమామిడి, కొట్లపల్లి గ్రామాల వద్ద భారీ జనాలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె.. మహిళలు, వృద్ధులను పలకరిస్తూ.. వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. పెడబల్లి నుంచి ఊరూరా భువనేశ్వరికి స్వాగతం పలికారు. కొండకమర్ల, ఓబుళదేవరచెరువు, గాజుకుంటపల్లిలో మహిళలు, చిన్నారులు పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు.



కదిరిలో...



మేడలెక్కిన అభిమానం..



ఎయిర్‌పోర్టులో నారా భువనేశ్వరికి స్వాగతం పలుకుతున్న టీడీపీ ముఖ్య నేతలు



విద్యార్థినులతో ...



జేఈఈ మెయిన్‌లో అనంత కుర్రాళ్ల ప్రతిభ

అనంతపురం విద్య, ఫిబ్రవరి 13: దేశంలోని ప్రముఖ ఐఐటీలు, ఎన్‌ఐటీ సంస్థల్లో ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశం కోసం నిర్వహించే జేఈఈ మెయిన్ (సెషన్-1) పరీక్షల్లో అనంతపురం విద్యార్థులు సత్తా చాటారు. జనవరి 24వ తేదీ నుంచి ఈ నెల 1వ తేదీ వరకూ దేశవ్యాప్తంగా పలు పరీక్షా కేంద్రాల్లో ఈ పరీక్షలు నిర్వహించారు. పరీక్షల ఫలితాలు సోమవారం రాత్రి విడుదలయ్యాయి. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఫలితాలను విడుదల చేసింది. ఈ ఫలితాల్లో పలువురు అనంతపురం జిల్లా విద్యార్థులు తమ సత్తా చూపారు. విద్యార్థులు ప్రతిభ చూపి మెరుగైన ర్యాంకులు సాధించారు. పలువురు విద్యార్థులు 99 శాతం పర్సంటైల్ సాధించారు.

99 శాతానికి పైగా పర్సంటైల్ సాధించిన విద్యార్థులు

నారాయణ విద్యార్థుల ప్రతిభ...

నారాయణ జూనియర్ కళాశాల విద్యార్థులు జేఈఈ మెయిన్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ చూపారు. కళాశాల విద్యార్థులు శశికిరణ్ 99.89 పర్సంటైల్, మేఘన 99.64 పర్సంటైల్, పఠాన్ ఆసిం ఖాన్ (99.23), వనదీప్ (99.08), హరి చాణిక్యరెడ్డి (98.88), సిద్ధార్థరెడ్డి (97.85), శివప్రసాద్ (97.70), భానుప్రకాష్ (97.45), సీతారామ్‌చరణ్ (97.27), వంశీక్రిష్ణారెడ్డి (97.23), అమ్రిత (97.05), అజయ్‌క్రిష్ణారెడ్డి (96.79), శివ సాయితేజ (96.52), అనిరుధ్ (96.45), అరవింద్ (96.44), మోహిత్ కుమార్‌రెడ్డి (96.10), ప్రణతి (95.37), మహర్షి (95.30), వినీల (95.26), షణ్ముఖ శివాన్విత (95.25) పర్సంటైల్ సాధించారు. దీంతో ఆ విద్యార్థులను కళాశాల కోర్ డీన్ బద్రీనాథ్, డీజీఎం వెంకటరామిరెడ్డి, డీన్ శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపాల్ రవిశంకర్‌రెడ్డి, శిఖామని, హిమబిందు, లక్ష్మన్న, ఒబన్న గౌడ్, జయలక్ష్మి, శ్రీధర్‌బాబు, ఈశ్వరి, ఏజీఎంలు హరిప్రసాద్, కేశవరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి అభినందించారు.

సతీష్ రెడ్డి సత్తా

జేఈఈ మెయిన్‌లో బుక్కరాయసముద్రం మండలం చిన్నంపల్లికి చెందిన రైతు లక్ష్మిరెడ్డి కుమారుడు సతీష్ రెడ్డి సత్తా చాటాడు. 99.99 పర్సంటైల్ సాధించాడు. దీంతో విద్యార్థి తల్లిదండ్రులు, బంధువులు ఆనందం వ్యక్తం చేశారు.



99.99 పర్సంటైల్ సాధించిన సతీష్‌రెడ్డి



99.89 పర్సంటైల్ సాధించిన శశికిరణ్



99.64 పర్సంటైల్ సాధించిన మేఘన




99.23 పర్సంటైల్ సాధించిన పఠాన్



99.08 పర్సంటైల్ సాధించిన నవదీప్

సేవాలాల్ జయంత్యుత్సవాలు ప్రారంభం



ప్రత్యేక అలంకరణలో సేవాలాల్ మహారాజ్

గుత్తిరూరల్, ఫిబ్రవరి 13: మండలంలోని బంజరాల పవిత్ర పుణ్యక్షేత్రం సేవాఘడ్‌లో మంగళవారం సంత్ సేవాలాల్ మహరాజ్ 285 జయంత్యుత్సవాలు ప్రారంభమయ్యాయి. స్వామివారికి వేకువజామున పంచామృతాభిషేకం చేసి, వివిధ పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో హోమాలు, కలశ స్థాపన, నవగ్రహ పూజ చేశారు. స్వామివారి ఉత్సవ మూర్తులను సాయంత్రం పల్లకిలో కొలువుదీర్చి మేళతాళాలతో ఊరేగించారు. స్వామివారికి బుధవారం ఉదయం పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు జరిపి స్వామని నిర్వాహకులు తెలిపారు. రాత్రికి వివిధ రాష్ట్రల నుంచి బంజారాలు పెద్దతున తరలివస్తారన్నారు. సంత్ సేవాలాల్ మహరాజ్ ఉత్సవ మూర్తిని పల్లకిలో కొలువు దీర్చి గుర్రంపై ఉరేగించనున్నట్లు వెల్లడించారు. మాలధరించి వచ్చిన భక్తులు ఇరుముడి సమర్పిస్తారని తెలిపారు. గురువారం మాతా జగదాంబ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి 101 మంది యువతులతో బోనాలు సమర్పిస్తారు. అనంతరం అత్యంత కీలకమైన మహాబోగ్ కార్యక్రమాన్ని నిర్వహించడంతో జయంతి ఊత్సవాలు ముగుస్తాయని వారు వివరించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు జగనాథరావు, ట్రస్టు ఉపాధ్యక్షుడు కేశవనాయక్, టీటీడీ బోర్డు సభ్యుడు అశ్వత్థనాయక్, ఎస్ కే రామచంద్ర నాయక్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి 13: బాలికల ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల ప్రతిభా కళాశాల, శ్రీసత్యసాయి జిల్లాలోని విద్యాలయాల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఉమ్మడి అనంత జిల్లా గిరిజన సంక్షేమశాఖాధికారి రామాంజనేయులు ప్రకటనలో సూచించారు. రెండు జిల్లాలోని కళాశాలల్లో కలిపి ఎంపీసీ 40, బైపీసీ 40 సీట్లు ఖాళీలున్నాయన్నారు. దరఖాస్తులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవడానికి ఈ నెల 25వ తేదీ వరకూ అవకాశం ఉందని, ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 7న ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ ఉంటుందని అన్నారు. గిరిజన బాలికలు ఉమ్మడి అనంత జిల్లాకు చెందిన వారై ఉండాలన్నారు. పూర్తి వివరాల కోసం https://www.aptwgurukulam.gov.in వెబ్‌సైట్ లేదా సెల్ 83090 05097కు సంప్రదించాలన్నారు.

జేఈఈ ఫలితాల్లో నారాయణ కళాశాల విద్యార్థి ప్రతిభ



ఆసిమ్‌ఖాన్‌ను అభినందిస్తున్న కళాశాల అధ్యాపక బృందం

హిందూపురం అర్బన్, ఫిబ్రవరి 13: జెఈఈ ఫలితాల్లో హిందూపురం నారాయణ కళాశాలకు చెందిన ఆసిమ్‌ఖాన్ 99.23 మార్కులు సాధించినట్లు ఏజీఎం కేశవరెడ్డి, ప్రిన్సిపాల్ లక్ష్మణ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆసింఖాన్ మాట్లాడుతూ ఐఏఎస్, ఐపీఎస్ లక్ష్యంగా చదివానన్నా రు. అధ్యాపకుల సహకారంతోనే ఈ స్థాయిలో నిలిచానన్నారు. విద్యార్థిని కళాశాల అధ్యాపక బృందం అభినందించారు.

మెరిసిన పురం విద్యార్థులు



జేఈఈ మెయిన్స్‌లో ప్రతిభ చాటిన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

హిందూపురం, ఫిబ్రవరి 13: జేఈఈ ఫలితాల్లో హిందూపురానికి చెందిన విద్యార్థులు చక్కటి ప్రతిభను కనబరిచారు. హిందూపురానికి చెందిన సువర్ణభారతి విద్యాసంస్థల అధినేత నీలకంఠారెడ్డి కుమారుడు గగన్‌శ్యామ్‌రెడ్డి 99.58 మార్కులు సాధించాడు. అదే కళాశాలకు చెందిన ఇంద్ర వంశీ 94.86, సారిక 88.58 ఫలితాలు సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను మంగళవారం కళాశాలలో యాజమాన్యం, అధ్యాపకులు అభినందించారు. విద్యార్థులు చక్కటి ప్రతిభ కనబరిచినట్లు కళాశాల ఏఓ అనీల్‌కుమార్ తెలిపారు. గగన్‌శ్యామ్‌రెడ్డి మాట్లాడుతూ భవిష్యత్తులో దేశానికి, సమాజానికి ఉపయోగపడేలా ఉద్యోగం సాధించాలన్నదే తన లక్ష్యమన్నారు.

మెరిసిన తాడిపత్రి విద్యార్థి



చక్రధర్‌రెడ్డి

తాడిపత్రి టౌన్, ఫిబ్రవరి13: జనవరిలో జరిగిన జేఈఈ మెయిన్స్ పరీక్షా ఫలితాల్లో తాడిపత్రికి చెందిన విద్యార్థి చక్రధర్‌రెడ్డి 256మార్కులతో 99.91 పర్సంటైల్ సాధించాడు. పట్టణానికి చెందిన సంగటి శ్రీనివాసులరెడ్డి, సంగటి రాజేశ్వరి దంపతుల కుమారుడు చక్రధర్‌రెడ్డి విజయవాడలోని శ్రీ చైతన్య కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. చక్రధర్‌రెడ్డి 8, 9, 10 తరగతులు పట్టణంలోని శ్రీ చైతన్య పాఠశాలలో చదివాడు. తండ్రి వృత్తిరీత్యా ఎల్‌ఐసీ ఏజెంట్. తల్లి గృహిణి. జేఈఈ మెయిన్స్‌లో మంచి ప్రతిభ చూపిన చక్రధర్ రెడ్డిని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

నేటి నుంచి వైసీపీపై యుద్ధానికి సిద్ధం

ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్, కార్మిక సంఘాల నేతలు హెచ్చరిక



ఐక్యతను చాటుతున్న ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్, కార్మిక సంఘాల నేతలు

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి 13: 'మా న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతున్నా నిర్లక్ష్యం వహిస్తారా..? మీ ఐదేళ్ల మోసానికి గుణపాఠం చెబుతాం.. ఇక బుధవారం నుంచి వైసీపీ ప్రభుత్వంపై మేం యుద్ధానికి సిద్ధం' అని ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్, కార్మిక సంఘాల నేతలు రాష్ట్రంలోని వైసీపీ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఎన్జీఓ హోంలో ఏపీ జేఏసీ రౌండ్ టేబుల్ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఇందులో ఏపీఎన్జీఓ సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. సోమవారం రాత్రి అన్ని సంఘాల నేతలతో రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు తొమ్మిది గంటలు చర్చలు జరిపారని, అయినా ఏ ఒక్కటిపై సరైన సమాధానం ఇవ్వకపోవడం బాధాకరమని అన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వానికి ఉద్యమ కార్యచరణకు సంబంధించిన నోటీసులు అందజేశామని, బుధవారం నుంచి ఉద్యమాలకు శ్రీకారం చుడుతున్నామని అన్నారు.

అధైర్యపడకండి అండగా ఉంటాం: నారా భువనేశ్వరి


ఓడీసీ మండలం గాజుకుంటపల్లి ప్రజలకు విక్టరీ చూపుతున్న నారా భువనేశ్వరి

పుట్టపర్తి రూరల్, ఫిబ్రవరి 13: అధైర్యపడకండి.. మీ కుటుంబాలకు అండగా మేము ఉంటామని టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరి బాధితుల కుటుంబాలకు భరోసా ఇచ్చారు. చంద్రబాబు అక్రమ అరెస్టును తట్టుకోలేక గుండెపోటులో మృతి చెందిన వారి కుటుంబాలను మంగళవారం ఆమె పరామర్శించారు. నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా ఆమె స్వయంగా వారి ఇళ్ల వద్దకే వెళ్లి వారిని ఓదార్చి ధైర్యం చెప్పారు.

తొలుత పుట్టపర్తి రూరల్ మండలం గాజులపల్లిలో భువనేశ్వరి పర్యటించారు. అక్కడ మృతుడు చంద్రబాబు అరెస్టు వార్తను విని గుండెపోటుతో మృతి చెందిన బావయ్య ఇంటికి వెళ్లారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. పార్టీ అండగా ఉంటుందని భరోసా నిచ్చారు. తర్వాత బావయ్య సతీమణి రామలక్ష్మమ్మకు 3 లక్షల చెక్కును అందజేశారు. మార్గమధ్యంలో మామిళ్లకుంట, కప్పలబండ, పెడపల్లిల దారిపొడవునా తెలుగుదేశం శ్రేణులు, మహిళలు పెద్దఎత్తున రోడ్డుపైకి వచ్చి మంగళహారతులతో భువనేశ్వరికి ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో రూరల్ మండల కన్వీనర్ విజయ్‌కుమార్, స్థానిక నాయకులు ఊరువాకిలి సురేష్‌నాయుడు, రాళువారిపల్లి కేశవ, ఐటీడీపీ నియోజకవర్గ అధ్యక్షుడు కొత్తపల్లి జయప్రకాష్, పెద్దఎత్తున కార్యకర్తలు ఉన్నారు.

ఓబుళదేవర చెరువు: గాజులపల్లి అనంతరం భువనేశ్వరి ఓబుళదేవర చెరువు మండలం గాజుకుంట పల్లిలో పర్యటించారు. అక్కడ చంద్రబాబు అరెస్టును టీవీలో చూస్తూ మృతి చెందిన టీడీపీ కార్యకర్త మేకల రామచంద్ర ఇంటికెళ్లి ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుమారుడు మధు, కోడలు భానుతో మాట్లాడి సంఘటనపై వివరాలడిగి తెలుసుకున్నారు. తాము, టీడీపీ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. తర్వాత రూ. 3లక్షల చెక్కును అందించారు. భువనేశ్వరి గాజుకుంటపల్లికి వచ్చిన సందర్భంగా ఆమెను చూసేందుకు దారి పొడవునా జనం పోటెత్తారు. మహిళలు, వృద్ధులుసైతం మిద్దెలెక్కారు. భువనేశ్వరి చేతులూపుతూ ప్రతిఒక్కరికీ అభివాదం చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్‌శెట్టివారి జయచంద్ర, మాజీ జడ్పీటీసీ పిట్టా ఓబుల రెడ్డి, నాయకులు పీట్ల సుధాకర్, అంజన్‌రెడ్డి, సాంబశివారెడ్డి, బుదిలి ఓబులరెడ్డి, గిరినాథ్‌రెడ్డి, నూరినాయుడు, శబరీష్ నాయుడు, కంచి సురేష్, సుధాకర్, జెరిపిటి అంజనప్ప, జెరిపిటి ప్రసాద్, వెంకటరంగారెడ్డి, అబ్లు, నిజాం, చాంద్‌బాషా, పొగాకు షబ్బీర్, చికెన్ షానూ, మండెం చాంద్‌బాషా, వైదేహి,భాగ్యమ్మ, అఖిల, జ్యోతి, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

కదిరి: ఓడీసీ మండల పర్యటన అనంతరం ఆమె కదిరి పట్టణంలోకి వచ్చారు. అక్కడ 8వ వార్డులోని ఎస్సీకాలనీలో మృతి చెందిన ప్రకాష్ ఇంటికి వెళ్లారు. ఆయన చిత్రపటానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మీ కుటుంబానికి తెలుగుదేశం అండగా ఉంటుందన్నారు. నాయకుడు చంద్రబాబు మీకు భరోసాగా ఉన్నారని తెలిపారు. తర్వాత రూ.మూడులక్షల చెక్కును వారికి అందించారు. ఆమె వెంట నియోజకవర్గ ఇన్‌చార్జి కందికుంట వెంకటప్రసాద్, మహిళాకమిషన్ మాజీ సభ్యురాలు పర్వీన్‌బాను, స్థానిక నాయకులు బండల నాయుడు, చల్లా రామాంజులమ్మతో పాటు ముఖ్యనాయకులు, పెద్దఎత్తున కార్యకర్తలు ఉన్నారు.

అలాగే కదిరి మండలం ముష్టిపల్లి గ్రామానికి వెళ్లి మృతి చెందిన టీడీపీ కార్యకర్త బంగి చంద్ర ఇంటికి వెళ్లారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబాన్ని పరామర్శించి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. రూ.మూడులక్షల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో మోపూరిశెట్టి చంద్రశేఖర్, లాయర్ గంగిరెడ్డి, ప్రేమలత, నాయకులు, కార్యకర్తలున్నారు.

తలుపుల మండలం ఎగువపేటలోనూ భువనేశ్వరి పర్యటించారు. ఆ గ్రామంలో మృతి చెందిన టీడీపీ కార్యకర్త మహేష్ ఇంటికి వెళ్లారు. అక్కడ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తర్వాత కుటుంబసభ్యులను పరామర్శించి మూడులక్షల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ముబారక్, మేడా శంకర్, విశ్వనాథ్‌రెడ్డి, రాజారెడ్డి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

తనకల్లు: మండలంలోని కోర్తికోట గ్రామంలో భువనేశ్వరి పర్యటించారు. అక్కడ మృతుడు ఎస్‌కె బుడన్‌సాబ్ ఇంటికి వెళ్లారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యుల్ని పరామర్శించి అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. తర్వాత రూ.మూడులక్షల చెక్కును మృతుడి భార్య సాయిబీకి అందించారు. కార్యక్రమంలో కందికుంట వెంకటప్రసాద్, మాజీ సర్పంచ్ మస్తాన్‌వలీ, కన్వీనర్ రెడ్డిశేఖర్‌రెడ్డి, మాజీ కన్వీనర్ శంకర్‌నాయుడు, నాయకులు శోభ, సరోజమ్మ, బాగేపల్లి చలపతి, ఉత్తన్ననాయక్, సోంపాళ్యం నాగభూషణం, తెలుగుయువత ప్రవీణ్‌కుమార్, హరినాయక్, శ్రీరాములనాయక్, క్రిష్టప్ప, శ్రీరాములు కార్యకర్తలు ఉన్నారు. మండలంలోని తనకల్లు, కొక్కంటి క్రాస్, కోర్తికోట గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలు భువనేశ్వరికి పెద్ద ఎత్తునస్వాగతం పలికారు. దారి పొడవునా ప్రజలు ఆమెను చూడడానికి గంటల తరబడి వేచి చూశారు.

టీడీపీ జెండాను రెపరెపలాడించాలి


కదిరిలోని ఎస్సీకాలనీలో ప్రజలకు అభివాదం చేస్తున్న నారా భువనేశ్వరి

కదిరి: వచ్చే ఎన్నికల్లో టీడీపీ జెండాను రెపరెపలాడించాలని , అందుకోసం అందరం కలిసికట్టుగా పనిచేద్దామని నారా భువనేశ్వరి పిలుపునిచ్చారు. కదిరి పట్టణలోని 8వ వార్డులోని ఎస్సీకాలనీలో మంగళవారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా చూడడానికి వచ్చిన ప్రజలతో ఆమె మాట్లాడారు. చంద్రబాబు అక్రమ కేసుల్లో అరెస్టయి 53రోజులు జైలులో ఉంటే.. తనకు తోడుగా ప్రజలు, టీడీపీ శ్రేణులు ఉండి ధైర్యం చెప్పారన్నారు. మాకు రక్షణ మీరే అన్నారు. వచ్చే ఎన్నికల్లో అందరం కలికి కట్టుగా పని చేసి టీడీపీని గెలిపిద్దామని పిలుపునిచ్చారు.

పల్లెల్లో భువనేశ్వరికి ఘన స్వాగతం

నల్లచెరువు: నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా నారా భువనేశ్వరి కదిరి నియోజకవర్గంలో పర్యటించారు. ఈ క్రమంలో మండల కేంద్రంతో పాటు మండలంలోని చిన్నయల్లంపల్లి, నల్లచెరువు, సంజీవపల్లి గ్రామాల మీదుగా ఆమె పర్యటన సాగింది. ఈ సందర్భంగా స్థానిక మహిళలు, కార్యకర్తలు, నాయకులు అధిక సంఖ్యలో ఆమెకు స్వాగతం పలికారు. ప్రజలందరికీ నారా భువనేశ్వరి అభివాదం చేస్తూ ముందుకు కదిలారు. నియోజకవర్గ ఇన్‌చార్జి కందికుంట వెంకటప్రసాద్ ఆమెకు పలువురు నాయకులను, కార్యకర్తలను పరిచయం చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ రాజశేఖర్, మాజీ ఎంపీపీ మాబూసాబ్, నాయకులు జక్కా లక్ష్మీనారాయణ, నాగరాజు, అంజనప్ప, నాగభూషణంనాయుడు, అశ్వర్థనాయుడు, సతీష్ చౌదరి, కిరణ్, దేవేంద్ర, చంద్రారెడ్డి, బయ్యారెడ్డి, నర్సిరెడ్డి, వెంకటరమణ, గంగాధర్, అల్లాబక్ష, నరసింహులు, కుమార్ తదితరులు ఉన్నారు.


నల్లచెరువులో ప్రజలకు అభివాదం ..


ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న టీడీపీ నాయకులు

టీడీపీ నాయకుల పూజలు

కొత్తచెరువు: నారా భువనేశ్వరి పుట్టపర్తి నియోజకవర్గంలో చేపట్టిన పర్యటన విజయవంతం కావాలని కోరుతూ మంగళవారం టీడీపీ మండల టీడీపీ నాయకులు మామిళ్లకుంట క్రాస్‌లోని ఆంజనేయస్వామి విగ్రహం వద్ద పూజలు చేశారు. అనంతరం కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆమె పర్యటనకు వారంతా తరలివెల్లారు. కార్యక్రమంలో నాయకులు సాలక్కగారి శ్రీనివాసులు, రామకృష్ణ, ఒలిపి శీన , కాంట్రాక్టు లక్ష్మీనారాయణ, బండ్లపల్లిరాజు, గాజుల చంద్ర, రవి, సుధాకర్, కిష్టప్ప, లక్ష్మీనారాయణ, కొత్తకోట ఆది, ఎన్నాయప్ప, రవి ఉన్నారు.

దాదాపు ఆరుగంటల పాటు సాగిన పర్యటన

● మారుమూల పల్లెలకు వెళ్లి పరామర్శ

కదిరి: మాజీ సీఎం చంద్రబాబు అక్రమ అరెస్టును తట్టుకోలేక ఎన్నో గుండెలు ఆగాయి. అందులో భాగంగా కదిరి నియోజకవర్గ వ్యాప్తంగా నలుగురు మృతి చెందారు. ఆ కుటుంబాలను పరామర్శించడానికి చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి స్వయంగా విచ్చేశారు. మంగళవారం సాయంత్రం 4గంటలకు నియోజకవర్గంలోకి అడుగుపెట్టిన ఆమెకు అల్లీపూర్ తండా వద్ద టీడీపీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. అనంతరం పట్టణంలోకి వచ్చి 8వార్డు ఎస్సీకాలనీలో నివాసముంటున్న ప్రకాష్ ఇంటికెళ్లి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం తనకల్లు మండలంలోని కోర్తికోటకు వెళ్లారు. అక్కడ బుడేన్‌సాబ్ కుటుంబాన్ని పరామర్శించారు. తర్వాత కదిరి మండలంలోని మారుమూల గ్రామమైన ముష్టిపల్లికి వెళ్లి బంగి చంద్రకుటుంబాన్ని పరామర్శించారు. అక్కడి నుంచి తలుపుల మండలంలోని ఎగువపేట కు చెందిన టీడీపీ కార్యకర్త మహేష్ కుటుంబాన్ని పరామర్శించారు. అండగా ఉంటామని హామీ ఇచ్చారు. నియోజకవర్గంలో దాదాపు ఆరుగంటలపాటు ఆమె పర్యటన కొనసాగింది. ఆద్యంతం నియోజకవర్గ ఇన్‌చార్జి కందికుంట వెంకటప్రసాద్ వెన్నటి ఉండి ఈ యాత్రను విజయవంతం చేశారు.

నేడు సంజీవపురానికి భువనేశ్వరి రాక

బత్తలపల్లి: నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా నారా భువనేశ్వరి మండలంలోని సంజీవపురం గ్రామంలో బుధవారం పర్యటించనున్నారు. మాజీ సీఎం చంద్రబాబు అక్రమ అరెస్టును జీర్ణించుకోలేక సజీవపురం గ్రామానికి చెందిన వెంకటరాముడు, చక్రయ్య గత సెప్టెంబరు నెలలో గుండెపోటుతో మృతి చెందారు. వారి కుటుంబాలను పరామర్శించేందుకు ఆమె గ్రామానికి రానున్నారు. ఈ సందర్భంగా తెలుగు రైతు నియోజకవర్గ అధ్యక్షుడి ఆధ్వర్యంలో భారీగా స్వాగత ఫ్లెక్సీలు వెలిశాయి.

పర్యటనకు తరలిరండి

ముదిగుబ్బ: నారా భువనేశ్వరి పర్యటన బుధవారం ముదిగుబ్బ మండలంలో సాగనుందని, స్వాగతం పలకడానికి మండలంలోని నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని టీడీపీ మండల కన్వీనర్ కరణం ప్రభాకర్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. చంద్రబాబు అక్రమ అరెస్టును జీర్ణించుకోలేక మరణించిన వారి కుటుంబాలను ఓదార్చడానికి నారా భువనేశ్వరి రానున్నట్లు చెప్పారు. కదిరి నుంచి ముదిగుబ్బ మీదుగా బత్తలపల్లి మండలం సంజీవపురానికి ఆమె వెళ్లనున్నారన్నారు. మండలకేంద్రంలో ఆమెకు స్వాగతం పలకడానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్య లో ఉదయం 9 గంటలకు చేరుకోవాలని ఆయన తెలిపారు.

చేనేత మహిళా ఆత్మీయ సమావేశాన్ని విజయవంతం చేయండి

ధర్మవరం: పట్టణంలో బుధవారం నారా భువనేశ్వరి చేనేత మహిళాఆత్మీయ సమావేశాన్ని నిర్వహించనున్నారని, విజయవంతం చేయాలని టీడీపీ నాయకులు మంగళవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం స్థానిక మారుతీరాఘవేంద్రస్వామి కల్యాణమండపంలో మధ్యాహ్నం 12గంటలకు జరుగనుందన్నారు. చేనేత మహిళలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి పరిటాలసునీత, ఎమ్మెల్సీ అనూరాధ, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పరిటాలశ్రీరామ్‌లు హాజరు కానున్నట్లు చెప్పారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ


ధర్మవరం మండలం నిమ్మలకుంటలో పోలింగ్‌కేంద్రం వద్ద పరిశీలిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

ధర్మవరం రూరల్/ కొత్తచెరువు/ బత్తలపల్లి ఫిబ్రవరి13: పట్టణ, రూరల్ పరిధిలోని ఓటర్లకు పోలింగ్ కేంద్రాలు అనుకూలంగా ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అరుణ్‌బాబు అధికారులకు సూచించారు. మండలంలోని నిమ్మలకుంట, సీసీకొత్తకోటలో పోలింగ్‌కేంద్రాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలింగ్‌కేంద్రాలలో ర్యాంపులు ఉన్నాయా లేవా, తగిన ఫర్నిచర్, విద్యుత్, తాగునీరు వసతులపై అడిగి తెలుసుకున్నారు. ప్రతి పోలింగ్‌కేంద్రంలో తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఎక్కడ ఎటువంటి పొరపాట్లుకు తావివ్వద్దని తెలిపారు. ఆయన వెంట తహసీల్దార్ ఎంఏ రమేష్, వీఆర్‌ఓలు, సిబ్బంది ఉన్నారు.

అలాగే కొత్తచెరువు మండలంలోని నారేపల్లి, మైలసముద్రం, కేశాపురం గ్రామాలలోని పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ కేంద్రాల్లో మౌలిక వసతులకు లోటు లేకుండా చూడాలని తహసీల్దార్ కళావతి, డిప్యూటీ తహసీల్దార్ స్వాతిని ఆదేశించారు. కలెక్టర్ వెంట వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

బత్తలపల్లి మండలకేంద్రంలోని పోలింగ్ కేంద్రాలను కూడా కలెక్టర్ పరిశీలించారు. స్థానిక బాలుర, బాలికల పాఠశాలల్లోని బూత్‌లను పరిశీలించి మౌలిక వసతులపై అరా తీశారు. కార్యక్రమంలో తహసీల్దార్ శివశంకర్‌నాయక్, వీఆర్వో భరత్‌ద్వాజ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా దంపెట్ల సమీపంలోని చిత్రావతి నదిని కలెక్టర్ పరిశీలించారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలి

పుట్టపర్తి, ఫిబ్రవరి 13: ప్రజలకు ప్రభుత్వాస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు, సిబ్బందికి కలెక్టర్ అరుణ్‌బాబు సూచించారు. జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌లో మంగళవారం హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఇందులో కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రులల్లో ఆధునిక సదుపాయాలు, వైద్య సిబ్బంది నియామకం, ఫ్యామిలీ డాక్టర్ తదితర కార్యక్రమాలను ప్రభుత్వం చేపడుతోందన్నారు. కనుక ప్రజలకు ఆధునిక, మెరుగైన వైద్యం అందించాలన్నారు. ఆసుపత్రి ఎమెర్జెన్సీ, క్యాజువాలిటీ, ఐసీయూ వార్డులలో శానిటేషన్ మెరుగు పరచాలని ఆదేశించారు. ఓపీశాతం పెంచాలని సూచించారు. సమావేశంలో సూపరింటెండెంట్ డాక్టర్ రోహిత్‌కుమార్, డీసీహెచ్ఓ తిప్పేంద్రనాయక్, వైద్యులు లక్ష్మీకాంత్‌రెడ్డి, గంగిరెడ్డి, ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ సెల్వి ఆంథోని తదితరులు పాల్గొన్నారు.

భూసేకరణను వేగవంతం చేయండి: జేసీ

పుట్టపర్తి, ఫిబ్రవరి 13 : జిల్లాలో సోలార్‌పవర్, విండ్ పవర్ పార్కుల ఏర్పాటుకు అవసరమైన భూసేకరణను వేగవంతం చేయాలంటూ జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో పవర్‌పాయింట్‌లకు భూసేకరణపై మంగళవారం ఆయన సమీక్ష నిర్వహించి మాట్లాడారు. జిల్లాలో 405ఎకరాల భూసేకరణ పూర్తయిందన్నారు. ఆంధ్రప్రదేశ్ నూతన, పునరుద్ధరణ, ఇంధన వనరుల సంస్థ ఆధ్వర్యంలో ఆదాని సంస్థ పనులు చేపట్టిందన్నారు. ఇందుకోసం అవసరమైన భూసేకరణ చేయాలన్నారు. తాడిమర్రి పెద్దకోట్ల వద్ద 24.82ఎకరాలు, రామగిరి ప్రాజెక్టుకు 8.44ఎకరాలు కేటాయించాలని సూచించారు. ఆయా మండలాధికారులు వెంటనే భూసేకరణ చేయాలంటూ ఆదేశించారు. కార్యక్రమంలో నెట్‌క్యాప్ ఎండీ రమణారెడ్డి, ఉమ్మడిజిల్లాల అధికారి వేణుగోపాల్‌రెడ్డి, ధర్మవరం, తాడిమర్రి, కనగానపల్లి, రామగిరి, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో హరీష్ పాఠశాల విద్యార్థుల ప్రతిభ

కదిరిఅర్బన్, ఫిబ్రవరి 13: హైదరాబాద్‌లోని ఎల్బీనగర్ సరూర్ స్టేడియంలో ఇటీవల జరిగిన అంతర్జాతీయ కరాటే పోటీల్లో పట్టణానికి చెందిన హరీష్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపినట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ ఎంఎస్ కిరణ్ తెలిపారు. వినయ్, హేమంత్, మనోజ్‌కుమార్, ఖాద్రీహితేష్, అసద్ గోల్డ్‌మెడల్, అస్లం, షామీర్, కార్తిక్, సాయిగణేష్, వంశీకృష్ణ సిల్వర్ మెడల్, నాగచైతన్య బ్రౌజ్ మెడల్ సాధించారని చెప్పారు. అలాగే బాలికల విభాగంలో శాలిని గోల్డ్‌మెడల్, నాగదీపిక సిల్వర్ మెడల్ సాధించారన్నారు. ప్రతిభ కనబరచిన విద్యార్థులను మంగళవారం పాఠశాలలో మెడల్స్‌ను, ప్రశంసాపత్రాలను అందజేసి అభినందించారు. కార్యక్రమంలో కరాటే మాస్టార్ అక్బర్‌అలీ, పీఈటీ ఖాదర్‌బాషా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వడ్డెర్లకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలి

ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 13: వడ్డెర్లకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని వడ్డెర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లెల జయరాం కోరారు. మండలంలోని గాజుకుంటపల్లిలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వడ్డెర్లు అన్నిరంగాల్లో వెనుకబడ్డారని, కావున రాజకీయ పార్టీలు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని కోరారు. అంతకుముందు నిజం గెలవాలి కార్యక్రమంలో నారా భువనేశ్వరిని కలిసినట్లు చెప్పారు. సమావేశంలో వడ్డెర సంఘం మండలాధ్యక్షుడు క్రిష్టప్ప, జిల్లా ప్రధాన కార్యదర్శి రమణ, జిల్లా కార్యవర్గ సభ్యుడు నాగార్జున, కేట రమణ, కొత్తపల్లి రమణ, శివమ్మ, రమణమ్మ పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు నిధులివ్వండి

ధర్మవరంరూరల్, ఫిబ్రవరి13: రానున్న వేసవిదృష్ట్యా తాగునీటి ఎద్దడి నివారణకై నిధులు మంజూరు చేయాలని ఉప్పునేసినపల్లి సర్పంచ్ ముత్యాలప్పనాయుడు కోరారు. మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ గిరక రమాదేవి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఇందులో సర్పంచ్ ముత్యాలప్పనాయుడు మాట్లాడుతూ గతేడాది వర్షాలు సరిగా లేక ఉన్న బోర్లులో నీరు ఇంకిపోతున్నాయన్నారు. ఇప్పటికే గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తుతోందన్నారు. ప్రస్తుతం మా గ్రామంలో తాగునీటి కోసం బోరు మరమ్మతులు, పైపులైన్లు కోసం నిధులు మంజూరుచేసి ఆదుకోవాలని కోరారు. అనంతరం ఎంపీడీఓ మమతాదేవికి నిధులు మంజూరు కొరకు వినతిపత్రం అందించారు.

టీడీపీతోనే బీసీల అభ్యున్నతి

పుట్టపర్తి, ఫిబ్రవరి 13 : తెలుగుదేశం పార్టీతోనే బీసీలు అభ్యున్నతి సాధించారని, టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్రంలో బీసీ సంక్షేమానికి ప్రత్యేక కృషి చేసిందని ఆ పార్టీ భట్రాజు సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ ప్రసన్నాంజనేయరాజు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ భవనంలో మంగళవారం ఆయన సమితి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భట్రాజుల సాధికార సమితి జిల్లా కన్వీనర్‌గా నాగేంద్ర ప్రసాద్‌ను ఎంపిక చేశారు. అనంతరం మాట్లాడుతూ ఆది నుంచి తెలుగుదేశం బీసీలకు అండగా ఉందన్నారు. అంతకు ముందు సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్‌ను కలిశారు. కార్యక్రమంలో మధుమోహన్‌రాజు, దివాకర్, రామాంజినేయులు, రామచంద్ర, చంద్రశేఖర్‌రాజు, ఎన్టీఆర్ జిల్లా కన్వీనర్ సత్యనారాయణరాజు పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదంలో గాయపడిన రైతు మృతి

నంబులపూలకుంట, ఫిబ్రవరి 13: మండలంలోని ధనియాన్‌చెరువు గ్రామానికి చెందిన నరసింహులు వురఫ్ ప్రభాకర్ (54) గత ఆదివారం విద్యుత్ షాక్‌కు గురై గాయపడిన విషయం విదితమే. కాగా అతను చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. మృతుడి బంధువులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. ధనియాన్‌చెరువులో నరసింహులుకు రెండెకరాల పొలం ఉంది. అందులో బోరు వేసుకుని పంటలు సాగుచేసి జీవనం సాగిస్తున్నారు. కాగా ఆదివారం అతను ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మరమ్మతులు చేస్తుండగా విద్యుత్ షాక్ కొట్టడంతో కింద పడి గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించ గా.. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందా రు. మృతుడి కుమారుడు రాజు ఇటీవల గుండెపోటుతో మృతి చెందినట్లు చెప్పారు. మృతునికి భార్య సారమ్మ, కుమార్తె ఉన్నారు. వారిని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

ఎమ్మార్సీ ఉద్యోగికి సన్మానం

నంబులపూలకుంట, ఫిబ్రవరి 13: మండలకేంద్రంలోని ఎమ్మార్సీలో మెసెంజర్‌గా పని చేస్తున్న శంకరయ్య ఉత్తమ ఉద్యోగిగా ఎంపికైనందుకు ఎమ్మార్సీ సిబ్బంది మంగళవారం ఘనంగా సన్మానించారు. శాలువా, పూలమాలలతో సత్కరించారు. ఎమ్మార్సీలో శంకరయ్య ఉత్తమ సేవలందించినందుకు జిల్లా స్థాయిలో గుర్తింపు వచ్చిందని ఎంఈఓలు గోపాల్‌నాయక్, సుబ్బిరెడ్డి పేర్కొన్నారు. ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్‌రెడ్డి, ఎమ్మార్సీ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

● భవిష్యత్తుకు గ్యారెంటీలో టీడీపీ నాయకులు


ధర్మవరం మండలం నేలకోటలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు కార్యకర్తలు

ధర్మవరం రూరల్, ఫిబ్రవరి 13: చంద్రబాబుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని టీడీపీ సీనియర్ నాయకుడు, జడ్పీ మాజీ చైర్మన్ చిగిచెర్ల ఓబిరెడ్డి, పార్టీ జిల్లాఉపాధ్యక్షుడు కుణుతూరు వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని బిల్వంపల్లి, నేలకోట, నేలకోటతండా గ్రామాల్లో మంగళవారం వారు నాయకులు, కార్యకర్తలతో కలిసి బాబుష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత ప్రజల నుంచి సమస్యలను ఫిర్యాదుల రూపంలో సైకిల్ గుర్తుతో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన చైతన్యరథంలోని బాక్సులోకి వేయించారు. తర్వాత మినీమేనిఫెస్టో కరపత్రాలు పంచుతూ పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ చంద్రబాబు సీఎం అయితేనే రాష్ట్రం అభివృద్ధి జరుగుతుందన్నారు. అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతాయని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ విజయానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కన్వీనర్ పోతుకుంట లక్ష్మన్న, సీనియర్ నాయకులు గొట్లూరుశ్రీనివాసులు, విజయసారథి, రాఘవరెడ్డి, జంగంనరసింహులు, అజయ్‌కుమార్‌రెడ్డి, నేలకోటరామ్మోహన్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, బిల్వంపల్లి బాబు, రవి, క్రిష్ణ, బాల ఓబిలేసు, జయప్రకాష్‌రెడ్డి మల్లేనిపల్లి చంద్ర, గరుడంపల్లిచంద్రాయుడు తదితరులు పాల్గొన్నారు.

తాడిమర్రి: మండలంలోని పూలంపల్లి, పుల్లప్పల్లి గ్రామాలలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు బాబుష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రజలకు మినీ మేనిఫెస్టో కరపత్రాలను పంచుతూ పథకాల గురించి వివరించారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ విజయానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కూచిరామ్మోహన్, నాయకులు రఘురాంచౌదరి, గోనుగుంట్ల భూషణ్, విశ్వనాథ్, శ్రీనివాసులు, కేశవనారాయణ, అశ్వర్థ, అశోక్, అప్పస్వామి, మురళీ, రామచంద్ర, పాపానాయుడు పాల్గొన్నారు.

ముదిగుబ్బ: మండలంలోని ఎన్ఎస్పీకొట్టాల, మల్లమ్మ కొట్టాల, సానేవారిపల్లి గ్రామాలలో టీడీపీ శ్రేణులు భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల కన్వీనర్ కరణం ప్రభాకర్, నాయకులు శేఖర్, ఆనంద్, రియాజ్,, తిరుపాల్, నూరి, బాబ్జాన్, శివయ్య,చంద్రశేఖర్, నారాయణస్వామి, నరేశ్ తదితరులు పాల్గొన్నారు. పాల్గొన్నారు.


తాడిమర్రి మండలం పుల్లప్పపల్లిలో..


ముదిగుబ్బ మండలం సానేవారిపల్లిలో..

పబ్లిసిటీ కోసం..

విద్యార్థినులను ఎండలో తిప్పుతారా

● ఎమ్మెల్యే కేతిరెడ్డిపై బీజేపీ నాయకుల మండిపాటు

ధర్మవరం, ఫిబ్రవరి 13: ధర్మవరంలో రాజకీయ పబ్లిసిటీ స్టంట్ కోసం విద్యార్థినులను ఎర్రటి ఎండలో తిప్పుతారా అంటూ ఎమ్మెల్యేకేతిరెడ్డి వెంకటరామిరెడ్డిపై బీజేపీ రూరల్ అధ్యక్షుడు చిగిచెర్లఅరవిందరెడ్డి, నాయకులు గొట్లూరు చంద్ర, తుంపర్తిపరమేశ్ మండిపడ్డారు. స్థానిక మాజీఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ కార్యాలయంలో మంగళవారం వారు విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి విద్యార్థుల ప్రగతి.. జగనన్నతో సాధ్యం సదస్సును నిర్వహించారని, ఆ సదస్సు వల్ల రాజకీయ లాభం పొందాలని చూశారని అన్నారు. అయితే ఆ సదస్సులో విద్యార్థుల నుంచి ప్రతిఘటన ఎదురైందన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల విద్యార్థులను పట్టణంలో రెండు కిలోమీటర్లు ఎర్రటి ఎండలో తిప్పడం జరిగిందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను చదువులకోసం పంపితే ఇలాంటి సదస్సులు నిర్వహించడం ఏమిటని ప్రశ్నించారు. 16వ వార్డు కౌన్సిలర్ ఈ సదస్సులో విద్యార్థులతో డ్యాన్సలు వేయించడమేంటని మండిపడ్డారు. ఈ దుర్మార్గపు ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయని పేర్కొన్నారు. సమావేశంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు డిష్‌రాజు, నాయకులు నారాయణస్వామియాదవ్, రాప్తాటిరాము, చిలకంసూర్యనారాయణ రెడ్డి, నబీరసూల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కోతలు... ఇబ్బందుల్లో రైతులు

చిలమత్తూరు, ఫిబ్రవరి 13: నాణ్యమైన విద్యుత్‌ను 9 గంటలపాటు నిరంతరాయంగా అందిస్తామని చెప్పిన ప్రభుత్వం ఎడాపెడా కోతలు పెడుతోంది. దీంతో రైతన్నలు ఆందోళనకు గురవుతున్నారు. వేసవి కాలం ప్రారంభమైన తరుణంలో చిలమత్తూరు మండలంలో నాలుగు రోజులుగా వేలాపాలాలేని అప్రకటిత విద్యుత్ కోతలను విధిస్తున్నట్లు రైతులు అంటున్నారు. దీంతో సాగు చేసిన పంటలను కాపాడుకోవడానికి నానా తంటాలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 9 గంటల విద్యుత్ ఉంటుందని చెప్పిన అధికారులు 7 గంటలకు మార్చేశారని, ఇచ్చే ఏడు గంటలైనా కోతలు లేకుండా ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. విద్యుత్ లైన్ల మరమ్మతులని, ఓవర్‌లోడ్‌తో అంటూ అప్రకటిత కోతలు విధిస్తున్నారని రైతులు అంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో పంటలకు నీటితడులు ఇవ్వలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిరంతరాయంగా విద్యుత్‌ను సరఫరాచేయాలని రైతులు కోరుతున్నారు.

నారా భువనేశ్వరికి ఘనస్వాగతం



భువనేశ్వరి రాకకోసం వేచి చూస్తున్న తండావాసులు, మాజీ ఎమ్మెల్యే బీకే

గోరంట్ల, ఫిబ్రవరి 13: నిజం గెలవాలి కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన నారా భువనేశ్వరికి గోరంట్ల మండలంలోని దిగువగంగంపల్లి తండావాసులు మంగళవారం ఘనస్వాగతం పలికారు. పెడబల్లి నుంచి గోరంట్ల మండలంలోని దిగువ గంగంపల్లి, దిగువగంగంపల్లి తండా మీదుగా ఓడీసీకి ఆమె వెళ్తున్న విషయాన్ని తెలుసుకున్న తండావాసులు స్వాగతం పలికేందుకు సిద్ధమయ్యారు. తండాకు చెందిన టీడీపీ నాయకుడు రామస్వామినాయక్, సాలుబాయి తదితరులు ఏర్పాట్లు చేశారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే బీకే పార్థసారథి అక్కడకు చేరుకుని నారాభువనేశ్వరి ఆ ప్రాంతంలో ఆగేలా చర్యలు తీసుకున్నారు. దీంతో తండావాసులు ఆమెకు ఘనస్వాగతం పలికారు.

టీడీపీ నాయకుల ముమ్మర ఏర్పాట్లు

పెనుకొండ: టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారచంద్రబాబునాయుడు సతీమణి భువనేశ్వరి నిజం గెలవాలి కార్యక్రమం పేరుతో చంద్రబాబు అరెస్టును జీర్ణించుకోలేక మరణించిన మృతుల కుటుంబాలను పరామర్శించడానికి వస్తున్నారు. బుధవారం పెనుకొండకు వస్తున్న ఆమెకు స్వాగతం పలికేందుకు టీడీపీ నాయకులు అన్ని ఏర్పాట్లు చేశారు. పెనుకొండ పట్టణం దర్గాపేటకు చెందిన టీడీపీ అభిమాని ఆర్ఆర్ రహీమ్ చంద్రబాబు అరెస్ట్ జీర్ణించుకోలేక గుండెపోటుతో మృతిచెందాడు. ఆయన కుటుంబాన్ని భువనేశ్వరి పరామర్శించి ఆర్థిక సాయం అందించనున్నారు.

విజయవంతం చేయండి

గుడిబండ, ఫిబ్రవరి 13: నారా భువనేశ్వరి పర్యటనను విజయవంతం చేయాలని టీడీపీ మండల కన్వీనర్ మద్దనకుంటప్ప, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు మంజునాథ్ కోరారు. మండలంలోని దిన్నేహట్టి గ్రామానికి చెందిన ముత్తప్ప చంద్రబాబునాయుడును అక్రమంగా అరెస్ట్ చేయడంతో టీవీలో చూస్తూ గుండెపోటుతో మృతి చెందాడన్నారు. నారా భువనేశ్వరి నిజం గెలవాలనే కార్యక్రమంలో భాగంగా మృతిచెందిన కుటుంబాలను పరామర్శించి ఆర్థిక సాయాన్ని అందించనున్నారని, పర్యటనను విజయవంతం చేయాలని కోరారు.

ఘనంగా ఫేర్‌వెల్ డే



డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు

పెనుకొండ, ఫిబ్రవరి 13: స్థానిక సత్యసాయి జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరం విద్యార్థులు ఘనంగా ఫేర్‌వెల్ డే నిర్వహించారు. ముందుగా సరస్వతీపూజ చేశారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ గంగాధర్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ, అంకితభావంతో చదివితే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారన్నారు. సమావేశంలో ప్రిన్సిపాల్ కేశవరావు, వైస్ ప్రిన్సిపాల్ అశోక్, అధ్యాపకులు మురళీకృష్ణ, రమేష్, చైతన్య, మహేష్, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

తూతూమంత్రంగా సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ ఎంపీడీఓ

రొద్దం, ఫిబ్రవరి 13: ప్రతి మూడు నెలలకోసారి ప్రజాసమస్యలకోసం జరిగే మండల సర్వసభ్య సమావేశం తూతూ మంత్రంగా జరిగింది. మంగళవారం ఎంపీపీ చంద్రశేఖర్, ఎంపీటీసీలు, సర్పంచులు ఆలస్యంగా రావడంతో 11.30గంటలకు సమావేశం ప్రారంభమైంది. గంటలోపే సమావేశాన్ని ముగించేశారు. మండలస్థాయి అధికారులు అనేక మంది గైర్హాజరయ్యారు. వ్యవసాయం, గ్రామీణ నీటి సరఫరా, వైద్య, ఆరోగ్యశాఖ, విద్యుత్, ఉపాధి, పశువైద్యశాఖ, పంచాయతీరాజ్‌శాఖ, గృహనిర్మాణం, స్త్రీసంక్షేమ, సిరికల్చర్ తదితరశాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో సచివాలయం, ఆర్బీకే, విలేజ్ క్లీనిక్, ప్రతి పంచాయతీకి కేటాయించిందని అయితే చాలా గ్రామాల్లో బిల్డింగ్‌లకు సంబంధించిన పనులను కాంట్రాక్టర్లు అర్ధంతరంగా ఆపేశారని వెంటనే పూర్తయ్యేందుకు ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని పీఆర్‌జేఈ వెంకటరమణ కోరారు. మంత్రి ఉషశ్రీ కార్యక్రమం ఉండటంతో త్వరగా సమావేశాన్ని ముగించి వెళ్లిపోయారు. కార్యక్రమంలో వైద్యాధికారి భాగ్యలక్ష్మీ, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ కేశవరెడ్డి, రీసర్వే డీటీ చంద్రశేఖర్‌రెడ్డి, ఏపీఓ రషీద్, సిరికల్చర్ అధికారి సుబ్రహ్మణ్యం, ఎంపీటీసీలు, సర్పంచులు వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

రేపు సేవాలాల్ జయంతి

మడకశిరటౌన్: సేవాలాల్ మహరాజ్ జయంతిని గురువారం పట్టణంలో నిర్వహిస్తున్నట్లు సేవాసమితి నాయకులు తెలిపారు. ఉదయం 10 గంటలకు పట్టణంలోని వాల్మీకి సర్కిల్ నుంచి ఊరేగింపు ప్రారంభమవుతుందన్నారు. మధ్యాహ్నం 1గంటకు మిట్టబండ ఆంజనేయస్వామి ఆలయం సమీపంలో సేవాలాల్‌భోగ్ కార్యక్రమం ఉంటుందన్నారు. 1.30 గంటలకు సమావేశాన్ని నిర్వహిస్తున్నామని, సేవాలాల్ జీవిత చరిత్రను వక్తలు వివరిస్తారన్నారు.



కరపత్రాలు విడుదల చేస్తున్న సేవాలాల్ సమితి నాయకులు

పరేషన్..!



ఇంటివద్దకే బియ్యం వాహనాన్ని కప్పి ఉంచేసిన దృశ్యం

అభాసుపాలవుతున్న ఇంటి వద్దకే రేషన్
డిపోలకే పరిమితమవుతున్న ఎండీయూ వాహనాలు
లబ్ధిదారులకు చేరని నిత్యావసరాలు

చిలమత్తూరు, ఫిబ్రవరి 13: వైసీపీ ప్రభుత్వం అమలుచేస్తున్న ఇంటింటికీ రేషన్ పంపిణీ కార్యక్రమం అభాసుపాలవుతోంది. ఎన్నికల్లో చెప్పాం.. అమలుచేసి తీరాల్సిందే అన్నట్లుగా నిర్వహిస్తున్న ఈ పథకం పేదలకు లేనిపోని కష్టాలను తెచ్చిపెడుతోంది. గతంలో ప్రతి నెల 1వ తేదీ నుంచి 5వతేదీ లోపు పేదల ఇళ్లల్లో రేషన్ సరుకులు ఉండేవి. అయితే ఇప్పుడు ఇంటింటికీ రేషన్ పేరుతో నెలలో 15వ తేదీ అయినా పేదల ఇళ్లకు నిత్యావసరాలు చేరడం లేదు. ప్రధానంగా ఇంటింటికీ రేషన్ పథకం పేరుతో రేషన్ బియ్యం వాహనాలు ఏర్పాటు చేయడంతో పంపిణీలో తీవ్రజాప్యంతోపాటు పేదలకు కష్టాలు తెచ్చిపెడుతోంది. గతంలో చౌకధాన్యపు డిపోలో 14 రోజులపాటు సరుకులు తీసుకునే అవకాశం ఉండేది. ఇప్పుడు పరిస్థితి మారింది. ఒక్కో ఎండీయూ ఆపరేటర్‌కి మూడు నుంచి ఐదు దుకాణాలు అప్పజెప్పడంతో వారు ఒక్కో డిపోలో మూడు రోజుల పాటు సమయం కేటాయిస్తున్నారు. అందులోను నెట్‌వర్క్ పనిచేయకపోవడంతో పగలంతా డిపో వద్దే లబ్ధిదారులు పడిగాపులు కాయాల్సి వస్తోంది.

అన్ని దుకాణాల్లో అదే పరిస్థితి

వైసీపీ ప్రభుత్వం చెప్పినట్లుగా ఇంటి వద్దకే రేషన్ సరుకులు అందుతాయని పేదలు ఎంతో సంతోషించారు. తీరా చూస్తే ఇంటివద్దకు కాదు కదా ఏ సమయంలో చౌకధాన్యపు డిపో వద్దకు వెళ్లి రేషన్ తీసుకురావాలో అర్థం కాక అవస్థలు పడుతున్నారు. మండలంలో 44 చౌకధాన్యపు డిపోలు ఉండగా, వాటిలో 16038 రేషన్ కార్డులు ఉన్నాయి. వీటికి ఇంటింటికీ రేషన్ పంపిణీ చేయడానికి పది ఎండీయూ వాహనాలను ప్రభుత్వం ఏర్పాటుచేసింది. ఒక్కో వాహన పరిధిలోకి మూడు నుంచి నాలుగు దుకాణాలను తీసుకువచ్చింది. ఒక్కో ఎండీయూ ఆపరేటర్ 1500 నుంచి 1650 కార్డుదారులకు ఇంటింటికీ వెళ్లి రేషన్ సరఫరా చేయాలని నిబంధన పెట్టింది. అయితే ఏ ఒక్క దుకాణం పరిధిలో కూడా ఇంటింటికీ రేషన్ జరగలేదు. ప్రతికార్డుదారుడు దుకాణం వద్దకే వెళ్లి రేషన్ తెచ్చుకుంటున్నాడు.

పనిచేయని ఈపోస్ యంత్రాలు

రేషన్ పంపిణీ కార్యక్రమం సరిగా అమలు కాకపోవడానికి ఇంటర్నెట్ సిగ్నల్స్ లేకపోవడమే ప్రధాన కారణంగా ఉంటోంది. గ్రామాల్లో ఇంటర్నెట్ సిగ్నల్స్ అరకొరగా ఉంటున్నాయి. రేషన్ పంపిణీ చేసే సమయంలో ఈపోస్ యంత్రాలు పనిచేయడం లేదు. దీంతో రేషన్ సరుకులతో వాహనం గ్రామాల్లోకి వెళ్లినా లబ్ధిదారుని నుంచి బయోమెట్రిక్ తీసుకోవడం కష్టమై పంపిణీ ప్రక్రియ సరిగా సాగడంలేదు. దుకాణం వద్ద కూడా అదే పరిస్థితి ఉంటోంది. ప్రతి ఎండీయూ రోజు కనీసం 100 నుంచి 120 మందికి రేషన్ ఇవ్వాలని అధికారులు ఖచ్చితమైన ఆదేశాలు ఇస్తున్నారు. బయోమెట్రిక్ పనిచేయని కారణంగా వారు రేషన్ పంపిణీకి నానా తంటాలు పడుతున్నారు. సిగ్నల్స్ ఎప్పుడు వస్తే అప్పుడు వెళ్లి లబ్ధిదారులు రేషన్ తీసుకోవాల్సి వస్తోంది. రేషన్ ఎప్పుడు ఇస్తారో ఖచ్చితమైన సమయం తెలియకపోవడంతో దుకాణం చుట్టూ నాలుగైదు రోజులు తిరగాల్సి వస్తోంది.

మండలంలోనే నెలకు రూ. 2,10 లక్షలు వృథా

ఇంటి వద్దకే రేషన్ పథకంతో ప్రతినెలా కేవలం చిలమత్తూరు మండలంలో రూ.2.10 లక్షల ప్రజాధనం వృథా అవుతోంది. పథకానికి సంబంధించి మండలంలో 10 వాహనాలు ఉండగా వాటి కోసం ప్రతి నెల ఒక్కో ఎండీయూ ఆపరేటర్‌కి రూ.21 వేలు చెల్లిస్తోంది. దీనికి తోడు 10 వాహనాలకు సుమారు రూ.70 లక్షల వరకు ఖర్చు చేసి పథకానికి వినియోగిస్తున్నారు. ప్రతి నెలా ఇంత పెద్దమొత్తంలో ప్రజాధనం వృథా అవుతున్నా మండల వ్యాప్తంగా ఉన్న 16038 కార్డుదారుల్లో ఒక్క కార్డు దారుడికి కూడా ఇంటి వద్దకు రేషన్ చేరిన దాఖలాలు లేవు. ప్రజలకు ఏ మాత్రం ఉపయోగపడని ఇంటి వద్దకే రేషన్ పథకం వల్ల లక్షల్లో ప్రజాధనం ఖర్చు జరుగుతోంది.

దుకాణాల వద్దే పంపిణీ

ప్రతి ఇంటికి రేషన్ పంపిణీ ఎండీయూ ఆపరేటరే చేయాలని ఖచ్చితమైన నిబంధన ఉంది. అయితే రేషన్ షాపు డీలర్లు తమ ఆదిపత్యం కొనసాగించుకోవడానికి ఎండీయుల నుంచి ఓపెన్ స్టాక్ బయోమెట్రిక్ వేయించుకొని డీలర్లే తమ దుకాణాల్లో రేషన్ పంపిణీ చేస్తున్నారు. ఎండీయూ ఆపరేటర్లు కేవలం బయోమెట్రిక్ వేయడానికి మాత్రమే ఉంటున్నారని స్పష్టమవుతోంది. దుకాణంలో రేషన్ పంపిణీ జరగకూడదు అనే నిబంధన ఉన్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో ఇంటి వద్దకే రేషన్ పథకం వచ్చినా దుకాణాల ద్వారానే పంపిణీ జరుగుతోంది.

నేడు ఉమానర్మదేశ్వరుల కల్యాణం



ఆలయంలో పూజలు చేస్తున్న వేద పండితులు

హిందూపురం అర్బన్, ఫిబ్రవరి 13: పట్టణ పరిధిలోని త్యాగరాజనగర్‌లో వెలసిన ఉమానర్మదేశ్వరస్వామి ఆలయంలో బుధవారం కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కల్యాణోత్సవం నేపథ్యంలో మంగళవారం ప్రత్యేక పూజలను వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారన్నారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు. గోపూజ, గణపతిపూజ, యాగశాల, గంగపూజ, స్వస్తివాచన, కలశస్థాపన, రుద్ర, దుర్గ హోమాలు తదితర పూజలు చేశారన్నారు. బుధవారం ఉదయం పార్వతీదేవి, ద్వాదశ జ్యోతిర్లింగాలు, 108 బాణ లింగాలు, చండికేశ్వర విగ్రహాలకు ప్రాణప్రతిష్ఠ నిర్వహించనున్నామన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక హోమాలు ఉంటాయన్నారు. సాయంత్రం 7 గంటలకు ఉమానర్మదేశ్వరుల కల్యాణమహోత్సవం ఉంటుందన్నారు. భక్తులు హాజరు కావాలని కోరారు.

నేడు ఏకశిలా విగ్రహ ప్రతిష్ఠ

పట్టణ పరిధిలోని దండురోడ్డులో వెలసిన 27 అడుగుల ఏకశిలా ఆంజనేయ స్వామి విగ్రహానికి బుధవారం తెల్లవారుజామున ప్రతిష్ఠ నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

మంత్రి ప్రసంగిస్తుండగా వెళ్లిపోయిన మహిళలు



సభ నుంచి వెళ్లిపోతున్న డ్వాక్రా సభ్యులు

రొద్దం, ఫిబ్రవరి 13: ఆసరా కార్యక్రమంలో భాగంగా మంత్రి ఉషశ్రీ మాట్లాడుతుండగానే సభకు వచ్చిన మహిళలు లేచి వెళ్లిపోయారు. మంగళవారం రొద్దంలోని రొద్దకాంబ దేవాలయం వద్ద ఆసరా కార్యక్రమానికి సంబంధించిన సభ జరిగింది. మండలంలోని మహిళా సంఘం సభ్యులు కార్యక్రమానికి హాజరయ్యారు. సౌకర్యాలు సరిగా లేకపోవడంతో మహిళలు అసౌకర్యానికి గురయ్యారు. దీంతో మంత్రి ప్రసంగం ప్రారంభంకాకనే మహిళలు వెళ్లిపోవడం కనిపించింది. మంత్రి ప్రసంగిస్తుండగా మహిళలు వెళ్లిపోతుండటంతో వెలుగు సీసీలు, యానిమేటర్లు వారిని అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో మహిళలు వారితో వాగ్వాదానికి దిగారు. గుంపులు గుంపులుగా మహిళలు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

ఆటో బోల్తా... విద్యార్థులకు గాయాలు

గోరంట్ల, ఫిబ్రవరి 13: మండలంలోని కమ్మలవాండ్లపల్లి వద్ద ఉన్న ఓ యూనివర్సిటీలో చదువుతున్న విద్యార్థులు ప్రయాణిస్తున్న ఆటోబోల్తా పడడంతో గాయపడ్డారు. అగ్రికల్చర్ బీఎస్సీ ఫైనలియర్ చదువుతున్న విద్యార్థులు మంగళవారం ఆటోలో గోరంట్లకు వస్తుండగా కమ్మలవాండ్లపల్లి క్వారీ వద్ద కుక్క అడ్డువచ్చింది. దీంతో ఆటో అదుపు తప్పి బోల్తాపడింది. ఆటోలో 11 మంది విద్యార్థులుండగా 9 మందికి గాయాలయ్యాయి. కర్నాటకలోని బాగస్‌కోటకు చెందిన స్ఫూర్తి, కడపకు చెందిన గ్లోరీ, నెల్లూరుకు చెందిన సాయిసంధ్య, గుల్బర్గాకు చెందిన పరమేశ్వరీ, వర్ష, రాయచూరు జిల్లాకు చెందిన లక్ష్మీ, గోదావరి ఖని పెద్దపల్లికి చెందిన అక్షరతోపాటు మరో ఇద్దరు గాయపడ్డారు. వారిని గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డాక్టర్ వినోద్‌కుమార్ చికిత్సలు అందించారు. స్ఫూర్తి, పరమేశ్వరీకి తీవ్రగాయాలయ్యాయి. మిగిలినవారు స్వల్పగాయాలతో బయటపడ్డారు. విద్యార్థి పరమేశ్వరి ఊపిరి తీసుకోవడానికి ఇబ్బంది పడుతుండడంతో మెరుగైన వైద్యంకోసం హిందూపురం వెళ్లాలని వైద్యులు సూచించారు.

ఎన్ఎస్ఎస్ వలంటీర్ల శ్రమదానం

పెనుకొండ, ఫిబ్రవరి 13: స్థానిక పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు మంగళవారం శ్రమదానం చేశారు. గ్రామంలోని నీటి ట్యాంకులవద్ద చెత్త చెదారం తొలగించి శుభ్రం చేశారు. రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటడానికి గుంతలు తవ్వారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పీఓలు డాక్టర్ జయప్ప, స్థానిక కౌన్సిలర్ రామాంజినేయులు, సుధాకర్, గ్రామస్థులు పాల్గొన్నారు.

16న మండల సర్వసభ్య సమావేశం

అగళి, ఫిబ్రవరి 13: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఈనెల 16న ఉదయం 11గంటలకు మండల సర్వసభ్య సమావేశం ఉంటుందని ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్, పరిపాలన అధికారి శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, జడ్పీటీసీ, ఎంపీపీ, కోఆప్షన్ మెంబర్, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులతోపాటు అన్నిశాఖల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించాలి

- కలెక్టర్ అరుణ్‌బాబు



మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి, ఫిబ్రవరి 13: ప్రజలకు ప్రభుత్వాస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు, సిబ్బందికి కలెక్టర్ అరుణ్‌బాబు సూచించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో మంగళవారం హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఇందులో కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఆధునిక సదుపాయాలు, వైద్య సిబ్బంది నియామకం, ఫ్యామిలీ డాక్టర్ తదితర కార్యక్రమాలను ప్రభుత్వం చేపడుతోందన్నారు. ఈ నేపథ్యంలో ప్రజలకు ఆధునిక, మెరుగైన వైద్యం అందించాలన్నారు. ఆసుపత్రి ఎమర్జెన్సీ, క్యాజువాలిటీ, ఐసీయూ వార్డులలో శానిటేషన్ మెరుగుపరచాలని ఆదేశించారు. ఓపీశాతం పెంచాలని సూచించారు. సమావేశంలో సూపరింటెండెంట్ డాక్టర్ రోహిత్‌కుమార్, డీసీహెచ్ఓ తిప్పేంద్రనాయక్, వైద్యులు లక్ష్మీకాంత్‌రెడ్డి, గంగిరెడ్డి, ఇన్‌చార్జ్ డీఎంహెచ్ఓ సెల్వి ఆంథోని తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్యకేంద్రం తనిఖీ

పెనుకొండ టౌన్, ఫిబ్రవరి 13: కాలం చెల్లిన మందులు పంపిణీ చేశారన్న ఫిర్యాదుతో ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని డిప్యూటీ డీఎంహెచ్ఓ మంజువాణి తనిఖీచేశారు. మంగళవారం సోమందేపల్లి గ్రామంలో ఉన్న ఆరోగ్యకేంద్రంలో సిబ్బందితో సమావేశం నిర్వహించి మందుల పంపిణీ రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఈనెల 10న ఓ రోగికి కాలం చెల్లిన మందులు ఇచ్చారన్న ఫిర్యాదు వచ్చిందని, దీనిపై విచారణ చేపట్టామన్నారు. ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

'తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోండి'


గుడిబండ, ఫిబ్రవరి 13: వేసవి సందర్భంగా గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డీపీఓ విజయ్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం గుడిబండ పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీలో ఇంటి, నీటి పన్నులు తప్పనిసరిగా వసూలు చేయాలన్నారు. అనంతరం పంచాయతీ అభివృద్ధిపై చర్చించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ నాగరాజనాయక్, పంచాయతీ కార్యదర్శులు గోవిందప్ప, రమేష్, అమరేష్, హరీష్, వరలక్ష్మీ, ధనలక్ష్మీ, అజయ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు తనిఖీలు: ఎస్ఐ

లేపాక్షి, ఫిబ్రవరి 13: రోడ్డు ప్రమాదాల నివారణకు వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ గోపి తెలిపారు. మంగళవారం గలిబిపల్లి క్రాస్‌వద్ద వాహనాల తనిఖీ నిర్వహించారు. వాహనాల రికార్డులు, హెల్మెట్లు ధరించని వాహనదారులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. వాహనదారులను ఇబ్బంది పెట్టడం తమ ఉద్దేశం కాదని, రోడ్డు ప్రమాదాలు నివారించడం కోసమే తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. రికార్డులులేని, హెల్మెట్‌లు ధరించని వాహనదారుల నుంచి అపరాధ రుసుం వసూలు చేశారు.

'19న రైతు సమస్యలపై ధర్నా'

పావగడ, ఫిబ్రవరి 13: తాలూకా కార్యాలయం ముందు రైతు సమస్యలు, తుంగభద్ర నీటితరలింపు ఆలస్యంపై రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేపడుతున్నట్లు ఆ సంఘం అధ్యక్షుడు పూజారప్ప తెలిపారు. మంగళవారం పీడబ్ల్యూడీ గెస్ట్ హౌస్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2017 సంవత్సరంలో తుంగభద్ర తాగునీటి కోసం అప్పటి ముఖ్యమంత్రి సిద్దరామయ్య రూ. 2350 కోట్ల నిధులను విడుదల చేశారన్నారు. అయితే తాగు, సాగు నీరు అందడంలేదని, ఇది పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. బగర్‌హుకుం భూములను సాగు చేసే రైతులకు పట్టాలు ఇవ్వాలన్నారు. సి.పవర్ కంపెనీపై చర్యలుతీసుకోవాలని డిమాడ్‌చేశారు. తమ డిమాండ్ల సాధన కోసం ధర్నా చేస్తున్నామని, విజయవంతం చేయాలని కోరారు.



మాట్లాడుతున్న రైతు సంఘం నాయకుడు పూజారప్ప

వినాయకుడి అలంకరణలో చంద్రమౌళీశ్వరుడు



మడకశిరటౌన్, ఫిబ్రవరి 13: పట్టణ సమీపంలోని పావగడ రోడ్డు చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో మాఘమాసాన్ని పురస్కరించుకొని మంగళవారం స్వామివారిని వినాయక అలంకరణలో కొలువుదీర్చారు. స్వామివారికి అర్చనలు, అభిషేకాలు చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

కన్నుల పండువగా జ్యోతుల ఉత్సవం



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

మడకశిరటౌన్, ఫిబ్రవరి 13: అమరాపురం మండల కేంద్రంలో వెలిసిన చోళమాంబదేవి జాతరలో భాగంగా మంగళవారం నిర్వహించిన జ్యోతుల ఉత్సవం కన్నుల పండువగా సాగింది. మహిళలు అమ్మవారికి పెద్దసంఖ్యలో జ్యోతులను సమర్పించారు. అమరాపురం మండల కేంద్రంతోపాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి జ్యోతులను రంగు రంగుల పూలతో అలంకరించి దేవాలయానికి మహిళలు తీసుకువచ్చారు. అర్చనలు, అభిషేకాలను అర్చకులు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు వేల సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

వానవోలు ఆలయానికి విరాళం

గోరంట్ల, ఫిబ్రవరి 13: మండలంలోని వానవోలు గ్రామానికి చెందిన షేక్ హిదయతుల్లా గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీకస్తూరి రంగనాథస్వామి ఆలయానికి రూ.50,116లు విరాళాన్ని మంగళవారం అందించారు. దీంతో ఆయనను ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు.